

రోడ్డు వేశారు .. కల్వర్టు మరిచారు..

విశాలాంధ్ర-జలుమూరు: తెంబూరు జంక్షన్ నుండి సారవకోట మండలం బొంతు జంక్షన్ వరకు నిర్మించిన తారు రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉన్నా మధ్యలో ఉన్న పురాతన కల్వర్టు లను అలాగే ఉంచడంతో పలు ప్రాంత ప్రయాణికుల ఆందోళన చేస్తున్నారు. పకడ్బాందీగా రోడ్డు వేసినప్పటికీ పురాతన కల్వర్టులు నిర్మించకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని రోడ్డు వెడల్పు అయినా కల్వర్టు ఇరుకుతూ ఉండడంతో భారీ వాహన రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని పలువురు ప్రయాణికులు ఆందోళన చేస్తున్నారు. పాలకులు అధికారులు పరిశీలించి రోడ్డు కోసం కోట్లు ఖర్చు చేశారని కల్వర్టులు మర్చిపోవడం బాధాకరంగా ఉందని పలువురు అభిప్రాయ వ్యక్తపరిచారు. ఇప్పటికైనా పాలకుల అధికారులు పరిశీలించి రోడ్డు వెడల్పుతో పాటు కల్వర్టు నిర్మించాలని కోరారు.

కార్గో ఎయిర్ పోర్ట్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలి

18 నుండి గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్రలు
రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నాయకులు

విశాలాంధ్ర-పలాస: ఉద్దాన ప్రాంతాన్ని ఉరి తీసే కార్గో ఎయిర్ పోర్ట్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని కోరుతూ మార్చి 18,19 రెండు రోజుల పాటు గ్రామాలలో నిర్వహించనున్న ప్రజా చైతన్య పాదయాత్రలు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర.వెంకటరమణ, సిపిఐ పలాస నియోజకవర్గ కన్వీనర్ చాపర వేణుగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నేత వంకల.మాధవరావు, సిపిఎం జిల్లా నాయకులు కొనారి మోహన రావులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టి.కే.ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన మేధో మధనం రౌండ్ టేబుల్ సమావేశం కార్గో ఎయిర్పోర్ట్ పోరాట కమిటీ అధ్యక్షులు కొమర. వాసు, అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం ప్రజలను నిరాశ్రయులు చేయడం అభివృద్ధి ఎలా అవుతుందని కేంద్ర పౌర, విమానయాన శాఖ మంత్రి కింజరాపు. రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను కొల్లగొట్టి కార్పొరేట్ కంపెనీలకు ధారధత్తం చేస్తే అభివృద్ధి ఎలా అవుతుందని వారు ప్రశ్నించారు. కార్గో ఎయిర్ పోర్టు కేవలం మూలపేట పోర్టు సరుకులను రవాణా చేయడం కోసం మాత్రమే ఇది ఏర్పాటు చేస్తున్నారని, కాబట్టి మూలపేట పోర్టుకు కేటాయించిన 2279 ఎకరాల్లో కార్గో ఎయిర్ పోర్ట్ కు అందులో 300 ఎకరాలు కేటాయిస్తే ఈ జిల్లాలో ఎక్కడ కూడా బలవంతపు భూసేకరణ చేయనవసరం ఉండదని వారు సూచించారు. జిల్లా అభివృద్ధి చెందాలన్నా, ప్రజల ఆదాయం పెరగాలన్న, వంశధార బ్యారేజ్ ఆధునీకరణకు 1500 కోట్ల రూపాయలు కేటాయించి శివారు భూముల వరకు నీరు అందిస్తే ప్రజలకు సంవత్సరానికి 1000 కోట్లు నుండి 1500 కోట్లు ఆదాయం వస్తుందని తద్వారా ప్రజలు కొనుగోలు శక్తి పెరిగి అనేక అనుబంధ పరిశ్రమలు వస్తాయని ఉపాధి దొరుకుతుందని వారన్నారు. వంశధార బ్యారేజ్ ఆధునికరణకు సింపు నుండి కేంద్ర మంత్రి నిధులు ఎందుకు తేవడం లేదని వారు ప్రశ్నించారు. బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టొద్దని కోరుతూ దశల వారిగా పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు . కార్గో ఎయిర్ పోర్టు కు వ్యతిరేకంగా మార్చ్18,19 తేదీలలో గ్రామాల్లో పాదయాత్రలు, సైకిల్ యాత్రలు చేయాలని సమావేశం నిర్ణయించిందని పేర్కొన్నారు. విశాల ప్రజల మద్దతుతో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ యం యల్ న్యూడెమోక్రసీ నాయకులు గొరకల బాలకృష్ణ, కార్యదర్శి జోగి అప్పారావు. పోట్టి ధర్మారావు, గుంటులోకనాధం, చిత్త గున్నయ్య , మర్ల సంతతోష్, మైలపల్లి శేఖర్, నల్ల పరుశురాం. గుంటి జోగిరాజు, జీడీ రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, యువజన నాయకులు దున్న హరికృష్ణ, దున్న రామారావు,పొట్టి మోహనరావు, కోనేరు రమేష్ తదితరులు పాల్గొన్నారు. ..

గుండె పోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

విశాలాంధ్ర-మందస: మందస పోలీసు స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న బి.గవరయ్య శుక్రవారం గుండె పోటుతో అకస్మికంగా ఇంటి వద్ద మృతి చెందారు. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు, పోలీసు శాఖ ఉద్యోగుల్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.మృత దేహాన్ని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతి రావు ,మందస ఎస్ ఐ కె.కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. ఆయన మృతికి సంతాపం తెలియజేసారు.కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు కార్యక్రమంలో పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర-కొత్తూరు : పాత పట్నం నియోజకవర్గంలో విలు వైన ప్రభుత్వ భూములు, చెరువులు,అటవీ, దేవాదాయ భూములు ఆక్రమణలకు గురై య్యాయని వీటిపై సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీనియర్ ఐఏఎస్,రాష్ట్ర రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి సిసోడియా కు శుక్రవారం. ఏం.ఎల్.ఏ మామిడి గోవిందరావు సచివాల యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో గ్రామ కంతాలు మరియు ప్రహరాజపాలెం రెవెన్యూ విలేజ్ పరిధిలో విలువైన ప్రభుత్వ "డి" పట్టా భూములు,చెరువుల ఆక్రమణలను తక్షణమే తొలగించాలని కోరారు అలాగే దేవాలయాల భూములపై సమగ్ర విచారణ జరపాలని విన్నవించగా శానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే మామిడి ఇక్కడ మీడియా కు తెలిపారు.

రెండు నర్సరీల్లో 2లక్షల మొక్కలు పెంపకం

టెక్కలి ఫారెస్ట్ రేంజర్ జగదీష్

విశాలాంధ్ర- నరసన్న పేట: టెక్కలి అటవీ శాఖ పరిధిలో ఒక ప్రభుత్వ, ఒక ప్రైవైట్ నర్సరీల్లో సుమారు రూ.15 లక్షలతో రూ. 2లక్షల మొక్కలు పెంచుతున్నా మని టెక్కలి ఫారెస్ట్ రేంజర్, జి.జగదీష్ అన్నారు. శుక్రవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గం పరిధిలోని సరియాపల్లి, నర్సింగపల్లి నర్సరీల్లో వేప, మర్రి, రావి, ఏగిశ, బాదం, గుమ్మడి టేకు, నేరేడు, దానిమ్మ, జామ, ఉసిరి, మందార, పారిజాతం, మారేడు తదితర మొక్కలు పెంచుతున్నామన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పెంచుతున్న ఈ మొక్కలను వచ్చే తొలకరికి నరసన్నపేట, పోలాకి, టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట అటవీ శాఖ అధికారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొండి

నేడు జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. మార్చి 08, శనివారం ఉదయం 10గంటలకు జిల్లా మొత్తం మీద 18 బెంచీలు నిర్వహించనున్నామని దీనిని జిల్లాలో గల ప్రజలందరూ వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు జిల్లా అంతటా చేయబడునన్నారు. దీనిలో రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, మోటార్, యాక్సిడెంట్, ఎన్ఐ యాక్ట్, మాట్రిమోనియల్, ఎక్సైజ్ కేసులు మొదలగు రాజీపడదగ్గ కేసులను ఈ జాతీయ లోక్ అదాలతో రాజీ చేసుకుని ఆపీలు లేని తీర్పుని పొందగలరని సూచనలు ఇచ్చారు.

ఇరాక్‌లో వలస కూలీ మృతి

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం ఆర్.బెలగాం గ్రామానికి చెందిన తిప్పిన భుజంగరావు(43) ఇరాక్లో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు గత నాలుగేళ్లుగా ఇరాక్లో పని చేస్తు ఇటీవల ఇంటి వచ్చి ఇరాక్కు వెళ్లడం జరిగిందని, శుక్రవారం ఉదయం కంపెనీలో అమోనియం గ్యాస్ లీక్ అవ్వడంతో భుజంగరావు మృతి చెందినట్లు తెలిపారు.భుజంగరావుకు భార్య జయ, ఇద్దరు కుమార్తెలు దీక్ష (9), రిషీ (6), తల్లి దమయంతి (65) ఉన్నారు. వారంతా కన్నీరు మున్నీరుగా రోధిస్తున్నారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెండాళం అశోక్ స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావాలని కోరుతున్నారు.

పలాస ఎల్లమ్మ జాతరకు భారీ బందోబస్తు

కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు

విశాలాంధ్ర-పలాస: ఉత్కళాంధ్ర ఇలవేల్పు ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవ సందర్భంగా శనివారం ఉదయం 6 గంటల నుండి రాత్రి 2 గంటల వరకు పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకటప్పారావు శు క్రవారం విలేకరులకు తెలిపారు. జాతరకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొన్ని నిబంధనలను అమలు చేస్తున్నామని తెలిపారు. మూడు రోడ్ల జంక్షన్ నుండి పలాస వైపుకు ఎటువంటి పెద్ద వాహనములు, చిన్న వాహనములు అనుమతించబడవని, పలాస వైపు నుండి కాశీబుగ్గ వైపు వచ్చే వాహనాలు కోసంగిపురం లేదా బెండి గెట్ వైపు నుండి రావాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తులు పలాస జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో గాని, రైల్వే గ్రౌండ్ లో గాని వారి వాహనాలు పార్క్ చేసుకోవాలని, ఈ ఆంక్షలు సమయములో ఆటో డ్రైవర్ లు సహకరించి జాతరకు తీసుకొచ్చే భక్తులను మూడు రోడ్ల జంక్షన్ వద్ద గాని, పలాస జూనియర్ కాలేజీ వద్ద గానీ వారిని దించి ఆంక్షలకు సహకరించాలని తెలిపారు. బందోబస్తుకు ఒక సర్కిల్ ఇన్స్పెక్టర్, ఐదుగురు సబ్ ఇన్స్పెక్టర్ లు, ఏడుగురు ఏఎస్ఐ లు, 19 మంది హెడ్ కానిస్టేబుల్ లు, 38 మంది కానిస్టేబుళ్లు, 13 మంది డబ్ల్యూ పిసిలు, 22 మంది హోంగార్డులు, 32 మంది ఏఆర్ కానిస్టేబుళ్లను నియమించమన్నారు. యాత్ర ప్రారంభం నుండి రెండు డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

ఎల్లమ్మ యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తి: మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు..

ఎంతో ప్రతిష్టాత్మకంగా శనివారం జరగనున్న ఎల్లమ్మ తల్లి జాతరకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కమిషనర్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తన హయాంలో మొట్టమొదట జరుగుతున్న జాతరను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎల్లమ్మ తల్లి వెలిసి ఉన్న వార్డుల్లో గత మూడు రోజులుగా పర్యటించి పారిశుద్ధ్యం,విద్యుత్, సమస్యలు పరిష్కరించానని, మరామతులకు గురైన కాలువలను పునరుద్ధరించినట్లు కమిషనర్ రామారావు తెలిపారు. ఎల్లమ్మ తల్లి గుడి సమీపంలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు బోరు బావిని మరమ్మతులు చేసి మంచి నీటి ట్యాంకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసులు మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో యాత్రను విజయవంతం చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

పరిష్కార వేదిక ద్వారా సమస్యలు పరిష్కారానికి ఆదేశాలు

- 5ఏళ్లలో సీజీఆర్ఎఫ్ కు 1577 సమస్యలు
- 1448 సమస్యలు పరిష్కారం.
- సి జీ ఆర్ ఎఫ్ చైర్మన్, విశ్రాంత జడ్జి సత్యనారాయణ

విశాలాంధ్ర-పొందూరు: సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల వద్దే విద్యుత్తు శాఖ కు సంబంధించి విద్యుత్ వినియోగ దారుల సమస్యలు పరిష్కారానికి అవకాశం కల్పిస్తున్నట్లు తూర్పు తీర ప్రాంత కన్సూమర్ గ్రీవెన్స్ రిడ్రసెల్ ఫోరమ్ చైర్మన్ బి. సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం మండల కేంద్రం పొందూరు విద్యుత్ సబ్ స్టేషన్ లో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని విద్యుత్ వినియోగదారులు సమస్యలు పై ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022 నుంచి 2025 ఇప్పటివరకు విద్యుత్ వినియోగ దారుల సమస్యల పరిష్కార వేదిక ద్వారా 1648 సమస్యలు పై ఫిర్యాదు స్వీకరించగా 1448 సమస్యలు పరిష్కారించబడ్డాయన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 219 సమస్యలు పై ఫిర్యాదులు అందగా 90 సమస్యలు పరిష్కా రం అయ్యాయన్నారు. కేవలం ఈ ఏడాదిలో వచ్చినవాటిలో 129 ఫిర్యాదు పరిష్కారించాల్సి ఉంద న్నారు. ఈ నాలుగేళ్లలో నష్టపరిహారం కోరుతూ ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ పరిధిలో 117 సమస్యలతో తమ దృష్టికి ధరకాస్తులు చేసుకోగా వాటిలో 108 సమస్యలు పరిష్కరించి రూ 14,36,950 నష్టపరిహారం అందిం చడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కార వేదికలతో పాటు 5 ఉమ్మడి జిల్లాల పరిధిలో 4 ఏళ్లలో 106 అవగాహన సదస్సు లు నిర్వహించామన్నారు. ఈ పరిష్కార వేదికలో బిల్లింగ్ లోపాలు విద్యుత్ తీగలు మరమ్మతులు, ట్రాన్స్ఫార్మర్స్ మరమ్మతులు, మీటర్ల కాలిపోవడం, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, మీటర్ లో లోపాలు, కొత్త విద్యుత్ సర్వీసులు, అదనపు లోడు మంజూరు, తదితర11 సమస్యలు పరిష్కరించ బడతాయన్నారు. ఈ పరిష్కార వేదికలో సి జీ ఆర్ ఎఫ్ సభ్యులు షేక్ బాబర్, సులేఖారాని ఎన్. మురళి కృష్ణ ఈ ఈ పి. యోగేశ్వరరావు, డీఈ రమణమూర్తి, ఏ ఇ రమణ పెద్దఎత్తున వినియోగదారులు పాల్గొన్నారు.

14న హలో ఆముదాలవలస ... చలో పిఠాపురం...

- పార్టీ సభ్యత్వంలో ముందంజలో ఆమదాలవలస
- 12వ ఆవిర్భావ పోస్టర్ ఆవిష్కరించిన సుడా చైర్మన్

విశాలాంధ్ర-ఆమదాలవలస: జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పిఠాపు రంలో 14వ తేదీన పండగ వాతావరణంలో నిర్వహించనున్నామని ఈ కార్యక్రమానికి జాతీయ ప్రాంతీయ పార్టీల ప్రతినిధులతో పాటు పార్టీ వ్యవస్థా పకులు ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ సమన్వ యకర్త, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ తెలిపారు. శుక్రవారం హలో ఆమదాలవలస,, ఛలో పిఠాపురం పోస్టర్లను జనసేన నియోజకవర్గ కన్వీనర్ పేడాడ రామమోహనరావు లు సమన్వయంతో కలిసి ఆవిష్క రించారు. కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ ఆ ముదాలవలస నియోజకవర్గం పార్టీ సభ్యత్వలను నమోదులో ముందంజలో ఉందని వివరించారు. అందుకు సహకరించిన క్షేత్రస్థాయి నాయకులనుంచి రామ్మోహనరావు సమన్వయం చేసుకొనే విధానం అభినందనీయమన్నారు. అలాగే 14వ తేదీన పిఠా పురంలో జరిగే 12వ జనసేన పార్టీ ఆవిర్భావ మహోత్సవం పండగల జరుపుకోవాలని అందుకు ప్రతి గ్రామంలోని పార్టీ కార్యకర్తలు, వీర మహిళలు జన సైనికులు అధిక సంఖ్యలో పాల్గొవాలని పిలుపుని చ్చారు. జనసేన పార్టీ బలోపేతం దిశగా అడుగులు వేసే ప్రతి సైనికుడు హాజరు కావాలని కోరారు. క్రమ శిక్షణకు మారుపేరైన జన సైనికులు సుశిక్షితులైన సైని కులు వలె పార్టీ బలోపేతానికి పనిచేయాలని పేడాడ రామమోహనరావు పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ వేడుకలలో కార్యకర్తలకు గౌరవం దక్కేల పవన్ కళ్యా ణ్ హామీ అందించనున్నారని తెలిపారు. ఈ కార్యక్ర మంలో శ్రీకాకుళం జిల్లా ఉప అధ్యక్షులు పాత్రుని పాపారావు, సరుబుజ్జిలి మండల అధ్యక్షులు పైడి మురళీ మోహన్, ఎంపీటీసీ అంపిలి విక్రమ్, పైడి నరేష్, ఉపాధ్యక్షులు పొన్నాడ బాలకృష్ణ, మజ్జి రాం బాబు, గేదెల వాసు, మాకాన సతీష్, గొద్దు కోటే శ్వరరావు నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, తదుతరులు పాల్గొనడం జరిగింది.

రఘు, బివిఆర్ఎస్ఐటిలదే గోకార్టింగ్ ఛాంపియన్ షిప్

విశాలాంధ్ర-టెక్కలి: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా ఈనెల 4 నుండి 7వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి గోకార్టింగ్ సీజన్-2 పోటీల్లో అత్యంత ప్రతిభ కనపరచి పెట్రోల్ విభాగంలో రఘు ఇంజినీరింగ్ కళాశాల విశాఖపట్నం ఓవరాల్ ఛాంపియన్ షిప్పు కైవశం చేసుకోగా, ఎలక్ట్రికల్ విభాగంలో బివిఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాల హైదరాబాదు మహిళా విద్యార్థులు ఛాంపియన్ షిప్పు సాధించుకున్నారు. తమిళనాడు సిమాట్స్ ఇంజినీరింగ్ కళాశాల పెట్రోల్ విభాగంలో రెండవ స్థానం పొందగా, ఎలక్ట్రికల్ విభాగంలో ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ స్థానాన్ని సాధించారు. తెలంగాణా, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ తమిళనాడుల నుండి 16 గోకార్టింగ్ బృందాలు పాల్గొనగా ప్రతీ టీం ఏదో ఒక అంశంలో ప్రత్యేకతను చాటుకొని ప్రశంశాపత్రాన్ని కప్పును చేజిక్కించుకున్నారు. మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్ డాక్టర్ డి. సంజీవరావు, టెక్కలి పోలీస్ సర్కిల్ ఇనస్పెక్టర్ అంబటి విజయ్ కుమార్ ల శు క్రవారం ఉదయం జరిగే ఆఖరి పోటీలను జెండా ఊపి ప్రారంభించగా సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం. కృష్ణమూర్తి ముఖ్యఅతిదిగా, హైదరాబాదు హెరీండైకంపెనీ ప్రాజెక్ట్మేనేజర్ విక్రమ్ అతిదిగా పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. నాలుగు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి గోకార్టింగ్ ఛాంపియన్ షిప్ సీజన్-2లో 600కు పైగా విద్యార్థులు పాల్గొని తమ సాంకేతిక భావాలను వ్యక్తం చేసుకున్నారు. కొత్త కొత్త ఆవిష్కరణలు, నాయకత్వ లక్షణాలు, అన్న విషయాలను తెలుసుకున్నారు. కళాశాల కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, గోకార్టింగ్ కన్వీనర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు కో-కన్వీనర్లు డీన్ డాక్టర్ డి. శ్రీరాములు, ఈసిఈ హెచ్ఓడి డాక్టర్ వి.అశోక్ కుమార్, సిఎస్ఈ హెచ్చడి డాక్టర్ వై.రమేష్, డీన్లు, హెచ్ఓడిలు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘువీర్ దొంటి కురిటి, విద్యార్థి కన్వీనర్లు పి.ఉదయ్ కుమార్, బి. సాయి సాకేత్లు పాల్గొన్నారు.

సహారా పేమెంట్స్ రానివారు బాండ్స్ తీసుకురండి

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట : సహారా ఇండియా పేమెంట్స్ రాని ఖాతాదారులు వారి బాండ్స్‌ను పట్టుకొని సహారా ఇండియా బ్రాంచ్‌కు రావాలని బీఎస్ రావు తెలిపారు. ఆమదలవలస, కొత్తకోటవారివీది జంక్షన్ వద్ద కార్యాలయంలో బ్రాంచ్ పాయింట్ ఓపెన్ చేసి ఆన్‌లైన్‌లో గతంలో పేమెంట్స్ కోసం అప్లైచేసి ఇంత వరకు పేమెంట్స్ రానివారు బాండ్లు పట్టుకొని బ్రాంచ్ ఆఫీస్ దగ్గరికి వస్తే వారి ఖాతాలకు సంబంధించి లోటు పాట్లు సరిచేసి డబ్బులు వచ్చేందుకు తోడ్పడతామన్నారు. ఖాతాదారులు గమనించి దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2రోజులు పాటు ట్యాంకుల ద్వారా తాగునీరు పంపిణీ : సర్పంచ్ సుందరమ్మ

బోర్లు వేస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-హిరమండలం: రెండు రోజులపాటు అనగా శనివారం, ఆది వారం హిర మండలం మేజర్ పంచా యతీ పరిధిలోని పలువీదుల్లో త్రాగు నీటిని హెల్పింగ్ హేండ్స్ అసోసియేషన్ వారి వాటర్ ట్యాంక్ ల ద్వారా త్రాగు నీటి ని పంపిణీ చేయబడునని సర్పంచ్ దేవుదల సుందరమ్మ శుక్రవారం విలేకరుల కు తెలిపారు. హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న బోర్ బావుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున గ్రామీణ నీటి సరఫరా విభాగం వారు కొత్త గా మూడు బోరు బావులు త్రవ్వ చుండడం వలన రెండు రోజులు పాటు త్రాగు నీటిని సరఫరా చేయ లేకపోవు చున్నామని ఈ అంత రాయమును ప్రజానీకానికి తెలియజేయుచున్నామని ఈఓ టి హరి కృష్ణ, పంచాయతీ జూనియర్ సహాయకులు కార్తీక్ తెలిపారు, తాత్కాలిక చర్యల్లో భాగంగా హెల్పింగ్ హేండ్స్ అధ్యక్షులు పి శ్రీధర్ వాటర్ ట్యాంక్ ద్వారా త్రాగు నీటిని పంచాయతీ సిబ్బంది ద్వారా పంపిణీ చేయబడునని సర్పంచ్ సుందరమ్మ తెలిపారు.

జింకిభద్ర పాఠశాలలో ఈగల్ క్లబ్ ఏర్పాటు

విశాలాంధ్ర -సోంపేట: జింకిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది మంది విద్యార్థులచేఈగల్ క్లబ్ ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాల వినియో గం వల్ల కలిగే అనర్థాల నివారణకు, అసాంఘిక చర్యలు అరి కట్టేందుకు ఈగల్ క్లబ్ ఏర్పాటుచేయమని సంబంధిత అధికారులు పేర్కొన్నట్లు తెలిపారు. ఈ క్లబ్ ఇన్‌చార్జ్‌గా గొరకల శ్రీనివాసరావు, పర్యవేక్షకునిగా హెచ్ఎం వేణుగోపాల్ వ్యవహరిస్తారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

జనసేన ఆవిర్భావ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-టెక్కలి: ఈ నెల 14న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన నాయకులు శ్రీకాకుళం సూడా చైర్మన్ కోరికాన రవికుమార్ మరియు టెక్కలి నియోజకవర్గ జనసేన ఇంఛార్జి కణితి కిరణ్ కుమార్ కోరారు. టెక్కలి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం కి సంబంధించి వాల్ పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోరికాన రవికుమార్ మాట్లాడుతూ జనసైనికులు అందరూ ఈ నెల 14న పిఠాపురంలో జరగనున్న ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం కణితి కిరణ్ మాట్లాడుతూ జనసేన అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందని, అది కూడా జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో జరగటం సంతోషంగా ఉందన్నారు. టెక్కలి నియోజకవర్గ నాలుగు మండలాలు నుంచి జనసేన నాయకులు, జనసైనికులు భారీగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

మూలుగుతున్న మురికి కాలువలకు నేడు మోక్షం



విశాలాంధ్ర-పోలాకి: పోలాకి మేజర్ పంచాయతీ మార్కెట్ మెయిన్ రోడ్ కు ఇరువైపులా మూలుగుతున్న కాలువల్లో మురికి, చెత్తా చెదారాన్ని తొలగించడంతో నేడు మోక్షం కలిగిందని స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఎవరేమనుకున్నా పంచాయతీ అభివృద్ధి చెందాలంటే పలు సమస్యలు ఉంటాయని అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పంచాయతీ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పంచాయతీ నిధులు తో పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ మేరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్న వ్యాపారస్తులు వ్యాపార వరంగా రోడ్డు ముందుకు జరగడంతో ఇరువైపులో ఉన్న కాలువలు మూతపడ్డాయని పేర్కొన్నారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న వర్తకులు జెసిబి రోడ్డు పైకి రావడంతో షాపు ముందు ఉన్న సామాన్లను వెనక్కి నెట్టక తప్పలేదని చెప్పొచ్చు. షాపులు వాళ్లకి ఎంతో కొంత నష్టం జరిగినా మార్కెట్లో జెసిబి తో పనులు ప్రారంభించారు. సర్పంచ్ తో పాటు పంచాయతీ ఇ ఓ పి ఆర్ డి పద్మావతి సెక్రెటరీ చంద్రరావు ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించడంతో పోలాకి మార్కెట్ విశాలముగా ప్రశాంతంగా బాగుందని గ్రామస్తులు అభినందించారు.

పల్లెల్లో ఎల్లమ్మ జాతర ఉత్సవాలు

విశాలాంధ్ర-జలుమూరు: పల్లెల్లో శుక్రవారం ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ ప్రకారంగా మండల కేంద్రం సారవకోటలో శుక్రవారం ఉదయం డప్పుల వాయిద్యాలు మధ్య మహిళల తలపై జంగిడి పెట్టుకుని పైన ఎల్లమ్మ విగ్రహాలు జంగిడితో ఇంటింటా వెళ్లి జోగి దండే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి కుటుంబ సభ్యులు ముందుగా దండుకున్న జోగిని ఎల్లమ్మ జంగిడిలో వేసి అమ్మ ఆశీర్వచనం అందుకున్నారు. నాటి నుండి నేటి వరకు ఎల్లమ్మ జాతర ఉత్సవాలు పల్లెల్లో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

ఇన్చార్జి ఎంపీడీవోగా మల్లేశ్వరరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ఇన్చార్జి ఎంపీడివోగా ఈవోఆర్డి బి. మల్లేశ్వరరావుకు బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న సీపాన హరిహరరావు సెలవు (మెడికల్ లీవ్) పై వెళ్లటంతో బాధ్యతలను ఈవీపీఆర్డీకి అప్పగించారు.

గౌరవ డాక్టరేటు పొందిన సిద్దార్థ

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం బాలాజిపుట్టుగ గ్రామానికి చెందిన డాక్టర్ లోళ్ల సిద్ధార్థ పీహెచ్డీ ని పొంది అత్యుత్తమ విద్యా మైలురాయిని అందుకున్నారు. హైదరాబాద్లోని గీతం డీమ్డ్-టు- బి విద్యాలయం గౌరవ డాక్టరేటును సగర్వాంగా ప్రకటించింది. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి శివకుమార్ మార్గదర్శకత్వంలో శుక్రవారం పీహెచ్డీ పట్టాను సిద్దార్థకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెథడ్ డెవలప్మెంటు అండ్ వాలిడేసన్ అఫ్ సెలక్టెడ్ డ్రగ్స్ ఇన్ బయాలాజికల్ మ్యాట్రిక్స్ బై అప్లికేషన్ టు పార్మకోకైనటిక్ స్టడీస్ అనే శీర్షికతో సిద్దార్థ్ చేసిన మార్గదర్శక పరిశోధన, ఔషధ శాస్త్రాలలో గణనీయమైన పురోగతిని సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. అలాగే డాక్టర్ సిద్దార్ద్ అధ్యయనం మానవప్లాస్మా లో కాస్మోటినిబ్, పొస్టెంసావిర్, రెలుగోలిక్స్ యొక్క ఖచ్చితమైన పద్ధతుల అభివృద్ధి, ధ్రువీకరణరే దారి తీసిందన్నారు. ఈ అత్యాధునిక విశ్లేషణాత్మక పద్దలు ఫార్మకోకైనెటిక్ అధ్యయనాలు, ఔషధ అభివృద్ధికి, క్లినికల్ పరిశోధన చికిత్స ఔషధ పర్యవేక్షణలో కీలమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డిఎస్ రావు, డెరెక్టర్ డివివిఎస్ఆర్ వర్మ. డీన్ ఫార్మసన్-ప్రొఫెసర్ జగత్తరన్దా దాస్, విశాఖపట్టణం ఎస్వోపి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాజా, ఫార్మసి, సైన్స్ విభాగాల విశిష్ట అధ్యాపకలు పాల్గొన్నారు. ది ఫారం ఫర్ బెటర్ శ్రీకాకుళం సంస్థ చైర్మన్, సీనియర్ జర్నలిస్టు గొండ్యాల దుర్గా ప్రసాద్ తో పటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

విశాలాంధ్ర-సోంపేట: సోంపేటలో జామి ఎల్లమ్మ జాతర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎల్లమ్మ జాతర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో పట్టణంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శుక్రవారం ఉదయం నుంచి అమ్మవారినిదర్శించుకున్నారు. మెయిన్రోడ్డుకు ఆనించి ఉన్న దేవాలయం వద్ద రద్దీని దృష్టిలో పెట్టుకుని కాశీబుగ్గ డిఎస్పీ వెంకట అప్పారావు, సోంపేట సీఐ మంగరాజు, ఎస్సై లోవరాజు గురువారం రాత్రి చేరుకుని ఆలయ కమిటీతో మాట్లాడి అన్ని అంశాలను పరిశీలించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి బారువ నుంచి సోంపేట వైపు, సోంపేట నుంచి బారువ వైపువెళ్లే అన్ని రకాల వాహనాలను పూర్తిగా నియంత్రించారు. ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారిపై రాకపోకలు సాగించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో శుక్రవారం సాయంత్రం జామిఎల్లమ్మ జాతర భక్తులతో కిటకిటలాడింది.

జిల్లా స్థాయిలో ఎంపికైన ఇద్దరు పలాస ఆర్పీలు

విశాలాంధ్ర-పలాస: మహిళా దినోత్సవ సందర్భంగా మెప్మా విభాగంలో ఉత్తమ సేవలు అందించిన ఆర్పీ లకు జిల్లా స్థాయిలో మెప్మా, ఎం డి గుంటూరు వారు అవార్డు ప్రకటించడం జరిగింది. శ్రీకాకుళం జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన మొదటి రెండు స్థానాలు పలాస కు చెందిన పిట్ట గీత మరియు పొట్నూరు జీవితలు ఎంపిక కాగా మూడో స్థానం శ్రీకాకుళం ఆర్పీ ఎంపికయింది. వీరికి శ్రీకాకుళంలో శనివారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందించడం జరుగుతుందని మెప్మా టిఎంసి మోహన్ తెలిపారు.

అర్హులైన పేద కుటుంబాలను గుర్తించండి

మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు

విశాలాంధ్ర-పలాస: అర్హులైన పేద కుటుంబాలను నిజాయితీగా గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. రామారావు ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు కొత్తగా ప్రవేశపెట్టిన పీపుల్స్ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ సర్వే పై శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘంలో గల అన్ని సచివాలయంలకు చెందిన కార్యదర్శులతో శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామారావు మాట్లాడుతూ ప్రధానంగా దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించ వలసిందిగా తెలిపారు. కార్యదర్శులు సేకరించిన డేటా ఆధారంగా ఇంటి అవసరాలకు అనుగుణంగా ప్రైవేట్ రంగంతో కలిసి ప్రత్యేక ప్రాజెక్టులు అమలు చేయబడతాయని,. ప్రభుత్వము సమర్థవంతమైన ప్రణాళికలు రూపొందించేందుకు గాను ఖచ్చితమైన వివరాలు అందించడమే ఈ సర్వే యొక్క ముఖ్య ఉద్దేశం అని కమిషనర్ అన్నారు. కాబట్టి కార్యదర్శులు అందరూ ఈ సర్వేను సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన నిరుపేదలను సక్రమంగా గుర్తించవలసిందిగా ఆదేశించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పురపాలక సంఘంలో గల 16 సచివాలయాలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.

9న రట్టి మత్స్య వల్లభ నారాయణ స్వామి డోలోత్సవాలు

విశాలాంధ్ర-మందస: మందస మండలం రట్టి గ్రామంలో వెలిసి ఉన్న మత్య వల్లభ నారాయణస్వామి డోలోత్సవ జాతర ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈవో టి. వాసుదేవరావు వివేకానంద యువజన సేవా సంఘ సభ్యులు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ డోలోత్సవాలు సందర్భంగా ఆలయాన్ని అంగరంగ వైభవంగా అలంకరించామని, ఆరు రోజులపాటు జాతర జరుగుతుందని వల్లభ నారాయణ స్వామికి ప్రత్యేక అలంకరించి ఆలయ ప్రధాన అర్చకుడు రట్టి నీలకంఠం, రట్టి ప్రహ్లాద, రట్టి సీతారాం వేదమంత్రోత్సవాలు మధ్య అభిషేకల నిర్వహిస్తారని పేర్కొన్నారు. 9 రాత్రి 9 గంటలకు అంకురార్పణ 10న ఏకాదశి పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు 11ద్వాజరోహణ విశేష హెూమాలు 12న మగ కామ దాహనం జరుగుతుందని తెలిపారు. 13న వల్లభ నారాయణస్వామి నిజ స్వరూప దర్శనం, ధ్వజరవాహన విశేషా పూజలు 14 న డోలోత్సవ పూర్ణమి రోజున సముద్ర స్నానాలు కోల సేవలు జరుగుతాయని వెల్లడించారు.రట్టి మత్స్య వల్లభనారాయణ స్వామివారి దర్శనం కోసం ఒడిస్సా మధ్యప్రదేశ్ కలకత్తా నుంచి భక్తుల వచ్చి మొక్కులు తీరుసుకుంటారన్నారు. వల్లభ నారాయణ స్వామి జాతరకు పలాస ఆర్టిసి డిపో ప్రత్యేక బస్సులు హరిపురం నుంచి రాకపోకలు సాగుతుంటాయని వివరించారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ లు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారని తెలిపారు.

కోడ్ ఎత్తేసినా...ముసుగు తీయరా...!

విశాలాంధ్ర-ఆమదాలవలస: మహనీయుల విగ్రహాలు ప్రజలను చైతన్యవంతులను చేసే దిశగా ఉంటాయన్న ఉద్దేశంతో పట్టణ ప్రాంతం రహదారి కూడలి లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు. అయితే ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన విభాగానికి ప్రజా క్షేత్రంలో ఎన్నికలు నిర్వహిస్తారు. అందులో భా గంగానే ఇటీవల రాష్ట్రంలో శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మె ల్సీ ఎన్నికలకు గాను ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఈ విగ్రహ రూపాలు ఉపకరిస్తాయన్న ఎన్నికల కమిషన్ నిర్ణయంతో వాటికి ముసుగులుతొడిగారు. ఎన్నికలు గత నెలలో పూర్తికాగా, మార్చి మూడవ తేదీన లెక్కింపు పూర్తి ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. నాలుగవ తేదీ నుంచి ఎన్నికల కోడ్ ఎత్తివేసినట్లు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. మహానుభావులు చిత్ర పటాలు విగ్రహాలు ఓటర్లను ప్రభావితం చేస్తాయన్న ఉద్దేశంతో ఈ ముసుగులు వేస్తారు. కోడు తొలగించిన తర్వాత కూడా నేటికీ తొలగించకపోవడంపై పలు వి మర్శలు వినిపిస్తున్నాయి సంఘసంస్కర్తలు, రాజకీయ ప్రముఖులు మహనీయులు విగ్రహాలను ఆమదాలవలస పట్టణంలో కొన్ని కూడళ్ళ వద్ద ఈ ఏర్పాటు చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటువడ్డ ఇందిరా గాంధీ, కూడు గూడు గుడ్డ నినా దంతో ఎన్టీఆర్, హరితాంధ్రప్రదేశ్ నినాదంతో వైయస్సార్ విగ్రహాలకు నెల రోజులు పైగా ముసుగులు తొడిగారు. ఇప్పటికైనా వీటిని తొలగించాలని పలు వురు కోరుతున్నారు.

జనరిక్ మందులే వాడుదాం..

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: అందరం జనరిక్ మందులే వాడుదాం అని, భారతీయ ప్రధానమంత్రి జన్ ఔషది పరియోజన పథకం క్రింద ఏర్పాటుచేసిన జన ఔషది కేంద్రాలు జిల్లాలో మరిన్ని ప్రారంభం కావాలని, తద్వారా అతితక్కువ ధరకే నాణ్యమైన మందులు అందుబాటులోకి వస్తాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. టి. బాల మురలీకృష్ణ ఆకాంక్షించారు. కార్యక్రమంలో శుక్రవారం రెడ్ క్రాస్ సంస్థ మరియు ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైసెస్ బ్యూరో ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం స్థానిక రెడ్ క్రాస్ సంస్థ కార్యాలయం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి డిఎంహెచ్ఓ ముఖ్యఅతిథిలుగా పాల్గొని రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ తో కలిసి మాట్లాడుతూ జన్ ఔషది కార్యక్రమం ద్వారా ప్రముఖ కంపెనీలు తయారుచేసే మందులు, సర్జికల్ ఐటమ్స్ అతి తక్కువ ధరలకే నాణ్యమైనవి లభిస్తాయని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సామాన్యులకు కూడా ఔషదాలు అందుబాటులో ఉండేలా భారత ప్రధాని ప్రధానమంత్రి భారతీయ జన ఔషది పరియోజన పథకం ప్రారంభించారని గుర్తుచేసారు. 2008లో ప్రారంభమైన ఈ పథకం జిల్లాలో 7 కేంద్రాల ద్వారా ఔషదాలు అందించడం జరుగుతుందని, తద్వారా పేదలకు ఎంతో ఉపశమనం లభిస్తుందని అన్నారు. బి.జె పి జిల్లా అధ్యక్షులు సిరిపురపు తెజేశ్వర రావు మాట్లాడుతూ జన్ ఔషది దివాస్ నేటికీ 6 వసంతాలు పూర్తి చేసుకుంటున్న శుభతరుణమని, జన్ ఔషది సేవలు ద్వారా ప్రజలకు మరింత స్పష్టత కలిగించాలని, నాణ్యమైన మందులు అందరూ వినియోగించుకోవాలని ఆయన జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ నరసింహా కిషోర్, డ్రగ్స్ ఏడి ఎం.చంద్రరావు, రాష్ట్రీయ స్వాస్థ్య కార్యక్రమం నోడల్ అధికారి రాజేష్, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్మోహన్ రావు, రెడ్ క్రాస్ సంస్థ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె చెన్నకేశవ రావు, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, నిక్కు అప్పన్న, బి. చిన్మయిరావు, కళ్యాణ్, పి వైకుంఠ రావు, రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయకర్తలు కె.సత్యనారాయణ, జి.రమణ,పెంకి చైతన్య, బిజెపి సభ్యులు బిర్లింగి ఉమామహేశ్వర రావు, అట్టాడ రవిబాబ్జి, చల్లా వెంకటేశ్వర రావు, మేనేజర్లు గుణాకరరావు, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు. కె శ్యాంసుందర్ రావు, కె.నర్సింగరావు, ఫార్మాసిటిక్స్ భాగ్యభారతి, శ్రావణి, రెడ్ క్రాస్ సంస్థ వాలంటీర్లు, జూనియర్ రెడ్ క్రాస్ సంస్థ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు దారులను హేళన చేయడం సరికాదు

విశాలాంధ్ర-మందస: ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రైతులకు మద్దతు తెలుపుతున్న వారిని కొంతమంది హేళన చేయడం సరికాదని ఎయిర్ పోర్ట్ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మందస మండలం రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో భూ బాధిత రైతు దున్న హరికృష్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిడిమి గ్రామం ఎయిర్ పోర్ట్ భూ బాధిత రైతులు తరుపున హరికృష్ణ మాట్లాడుతూ ఈ నెల 1న తమ గ్రామానికి చెందిన కొంతమంది ఎయిర్ పోర్ట్ నిర్మాణాని సహకరిస్తామని మాట్లాడుతున్నారని వారి మాటలు భూ బాధిత రైతులుగా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గత నాలుగు నెలలు నుంచి కంటికి నిద్ర,కడుపుకు తిండి లేకుండా ఎయిర్ పోర్ట్ నిర్మాణం వద్దని ఎయిర్ పోర్ట్ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఆధ్వర్యంలో ప్రతీ గ్రామానికి తిరిగి బాధిత రైతులంతా ఏకమై పోరాటం చేస్తుంటే వారి కళ్ళు నెత్తికి ఎక్కాయని ప్రశ్నిస్తున్నామన్నారు.అభివృద్ధి పేరిట పచ్చని కొబ్బరి జీడీ పనస మునగ పంట పొలాల్లో ఎయిర్ పోర్ట్ నిర్మించి ఎవరికి లబ్ది చేకూర్చాలనుకుంటున్నారని ప్రశ్నించారు.స్థానికంగా ఉన్న రైతుల స్థిరాస్తి భూములు కోల్పోతాయని తాము భయాందోళనలో ఉంటే తమ తరుపున సెంటు భూమి లేని వారు,ఉద్దానం ప్రాంతానికి సంబంధం లేని వారు మా పోరాటానికి మద్దతు తెలుపుతుంటే వాళ్లే ఎయిర్పోర్ట్ నిర్మాణానికి అడ్డుపడుతున్నారని వాళ్ళను హేళన చెయ్యడం విడ్డూరంగా ఉందన్నారు. నాటి నుంచి నేటి వరకు సామాజిక బాధ్యత కలిగిన ఉద్యమకారులు లేకపోయి ఉంటే ఈపాటికి మన ఉద్దానం ప్రాం తాన్ని ఎప్పుడో కార్పొరేట్ పెద్దలకు అప్పనంగా అప్పజెప్పేవారని గుర్తు చేస్తున్నానని అన్నారు. పలాస ఎమ్మెల్యే శీరీష కూడా పలు సందర్భంలో రైతులు అనుమతి లేనిదే సెంటు భూమి కూడా తీసికోబోమని చెప్పినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.మా ప్రాణాలు పోయిన సరే ఎయిర్ పోర్ట్ కోసం సెంటు భూమి కూడా ఇచ్చే పరిస్థితి లేదని .1394 ఎకరాల్లోని భూ బాధిత రైతుల్లో ఏంతమంది స్వచ్ఛందముగా ముందుకు వచ్చి అభివృద్ధి కోసం భూములు ఇస్తారో మన ఉద్దానం ప్రజలు ముందు పూర్తి వివరాలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు.ఈ కార్యక్రమంలో బాధిత రైతులు జుత్తు గణపతి,జుత్తు చంద్రమ్మ, జానికమ్మ,గున్నయ్య, ధర్మారావు, అప్పారావు, ఉపేంద్ర, జుత్తు మోహిని, వల్లమ్మ, మెట్టూరు పురుషోత్తమం, కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

దేశబట్టిపై వంతెన నిర్మించాలి

కమిషనర్కు జనసేన నాయకులు వినతి

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పదో వార్డు పరిధిలో ఉన్న దేశబట్టిపై వంతెన నిర్మించాలని మున్సిపాలిటీ జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1988లో ఈ ప్రాంత రైతుల కోరిక మేరకు దేశభట్టిపై అప్పటి జిల్లా ఎంపీ దివంగత నేత హనుమంతు అప్పయ్య దొర వంతెనను నిర్మించేందుకు కృషి చేశారని నేడు అది శిథిలావస్థకు చేరుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వంతెనను రైతులు ఉపయోగించి రైతాంగ పనులు చేపడుతున్నారని, ఒకవేళ వంతెన కూలిపోతే వారు తీవ్ర నష్టపోతారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వార్డు ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని రెండు ప్రాంతాల్లో పవర్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అప్పటివరకు మంచినీటి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందిస్తూ కమిషనర్ రామారావు మాట్లాడుతూ త్వరలో వార్డుల్లో పర్యటిస్తానని తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ జనసేన కన్వీనర్ కోన కృష్ణారావు, శంకు శ్రీకాంత్, వార్డు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత కలిగిన పోస్టు ఇవ్వాలని చంద్రబాబుకు విజ్ఞప్తి

- ఎప్పుడూ కూడా టీడీపీ అని చెప్పుకోలేదు
- చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా పని చేశా
- ఏకైక రాజధాని అమరావతికి తెలుగు శక్తి పోరాటం చేశా
- టీడీపీ సభ్యుడు, తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర-ఆమదాలవలస: 2014 నుంచి తెలుగు దేశం పార్టీలో ఉన్నప్పటికీ ఎప్పుడూ కూడా టీడీపి అని చెప్పుకోలేదని, తెలుగు శక్తి పేరుతో గత వైసీపీ ప్రభుత్వం పై పోరు కొనసాగిం చానని, తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. పార్టీలు మారకుండా తెలుగుదేశం పార్టీ పట్ల విధేయతతో పని చేశానని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆముదాలవలసలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిశానని తెలిపారు. ఎమ్మెల్సీ లేదా తగిన ప్రాధాన్యత గల స్థానం కేటాయించాలని విజ్ఞప్తి చేశానన్నారు. ముఖ్యమంత్రి కూడా సాను కూలంగా స్పందించారని ముందు నుంచి కూడా తగిన స్థానం ఇస్తానని చెపుతూనే ఉన్నారని తెలిపారు. టీడీపి కోసం నిరంతరం పోరాటం చేసిన తాను చంద్రబాబు నాయుడు స్టాండింగ్ కు అనుగుణంగానే ఏకైక రాజ ధాని అమరావతి రాజధాని కోసం పోరాటం చేశానని పేర్కొన్నారు. మరోవైపు తెలుగు శక్తి పేరుతో పరోక్షంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి కొనసాగించిన ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజాస్వా మ్యబద్ధంగా యుద్ధం చేశానన్నారు. ఈ క్రమంలోనే తొమ్మిది పాటలను విడుదల చేసి వైసిపి దుర్మార్గాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు. తెలుగు శక్తి అధ్యక్షుడి హెూదాలో రాష్ట్రం లోని అన్ని జిల్లాలలో పర్యటించి ప్రజల సమస్యల పరి ష్కారానికి తన వంతుగా కృషి చేశానన్నారు. తన కుమార్తె ధన్వి రెండో పుట్టినరోజు వేడుకకు చంద్రబాబు నాయుడు స్వయంగా అక్షింతలు వేసి ఆశీర్వదించారని గుర్తు చేసుకున్నారు. తెలుగు దేశం పార్టీ నాయకులు బోడేపూడి దొరబాబు మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉత్తరాంధ్ర మరియు రాష్ట్ర నలుమూలా పర్యటించి పార్టీ కోసం ఆయన బి.వి.రామ్ ఎంతో కృషి చేశారు. జగన్ పైన ఒక భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, ఛత్రపతి శివాజీ లాగా దండయాత్ర చేశారు. చంద్రబాబు నాయుడు తప్పని సరిగా బి.వి.రామ గుర్తించి ప్రజలకు సేవ చేసేందుకు ఎమ్మెల్సీ లేదా రాష్ట్ర కార్పరేషన్ చైర్మన్ పదవి ఇవ్వవలసిందిగా కోరారు.

స్త్రీల రక్షణకై చట్టాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నరసన్నపేట: సమాజంలో స్త్రీల రక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి, కె.సునీత అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పి.జి కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, డా.వి.లత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వ్యవసాయాధికారిణి, సునీత హాజరయ్యారు. ఈ సంధర్భంగా సునీత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో సమానంగా తమ ప్రతిభను కనబరుస్తున్నారని, స్త్రీ సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. స్త్రీల రక్షణ కొరకు అభయ చట్టం, గృహహింసా చట్టం, సెక్సువల్ హెరాస్మెంట్ చట్టం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, శాంతిహేమ్, ఎన్సిసి అధికారి, డా.జి.రవికుమార్, అధ్యాపకులు, డా.పూజాభరధ్వాజ్, డా.పి.అన్నాజీరావు, పవిత్ర, కృష్ణవేణి, రెయ్యమ్మ, పల్లవి, శ్రీవిద్య, త్రినాధరావు, వేంకటేష్, నాగరాజు, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యవరం జెడ్పీహెచ్ఎస్లో ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, వకుళ రత్నమాల, మహిళా ఉపాధ్యాయురాలు, ఎన్.హైమావతి, లక్ష్మీ ప్రసన్న, భవానీ, సునీత, సుభాషిణిలను పుష్పగుచ్ఛమందించి, శాలువా కప్పి, ఘనంగా సన్మానం చేశారు. ఈ సంధర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, బి.కేశవరావు మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళలు మరెన్నో విజయాలు సాధించి, మహిళా లోకానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, లక్ష్మణరావు, రవికిరణ్, అమ్మినాయుడు, భీమారావు, అప్పన్న, తిరుమలరావు, సింహాచలం, ఆనంద్, కే.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్కు కాకినాడ ఆదిత్య విద్యార్థులు 39 మంది ఎంపిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల 39 మంది విద్యార్థినిలు ప్రముఖ ఎమ్ఎన్సి కంపెనీ ఇన్ఫోసిస్ ఐటి కు ఎంపిక అయినట్లు కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి,ప్రిన్సిపాల్ కె శివశంకర్ తెలియజేశారు,శ్రీకాకుళం జిల్లా నుండి తమ కాకినాడ ఆదిత్య మహిళా కళాశాల నుండి ఎక్కువ మంది ఎంపిక అవ్వడం సంతోషంగా ఉందన్నారు,సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సంపాదించడం కష్టతరం అయిన ప్రస్తుత రోజులలో కాకినాడ ఆదిత్య సాఫ్ట్వేర్ ఉద్యోగాలకు గమ్య స్థానంగా ఉందని, దీనికి కారణం విద్యార్థి కళాశాలలో చేరిన మొదటి సంవత్సరం నుండే క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రెనింగ్ ఇస్తూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థినిలను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా ఎన్ శేషారెడ్డి,సెక్రటరీ డా.ఎన్ సుగుణారెడ్డి,అకడమిక్ డైరెక్టర్ డా.బి.ఈ.వి.ఎల్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు,ప్లేసుమెంట్ అధికారి ఎల్ ప్రసాదరావు,అధ్యాపక సిబ్బంది,విద్యార్థినిలు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుంటే రాయితీ

- విద్యుత్ శాఖ ఈఈ యోగేశ్వరరావు

విశాలాంధ్ర-పొందూరు: విద్యుత్తు వినియోగదారులు పెరుగుతున్న తమ గృహ విద్యుత్ లోడు ఫీజు చెల్లింపుకు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకుంటే 50 శాతం రాయితీ ఇవ్వబడుతుంది అని విద్యుత్ శాఖ ఈ ఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్ స్టేషన్ కార్యాలయంలో మాట్లాడారు. జూన్ నెలల్లోగా ధరకాస్తు చేసుకోవాలన్నారు. అదనపు లోడు పెరిగిన విషయం విద్యుత్ శాఖ సిబ్బంది గుర్తిస్తే 100 శాతం రుసుము చెల్లించాల్సి ఉంటుం దన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. రమణమూర్తి ఉన్నారు.

మహిళా దినోత్సవానికి ముస్తాబైన జేబీటి పాఠశాల

విశాలాంధ్ర-జలుమూరు: శనివారం జరిగే మహిళా దినోత్సవ సందర్భంగా సారవకోట మండలం అవలింగి జేబీటిపాఠశాల అధ్వర్యంలో పలువురు విద్యార్థినిలు రంగురంగులతో రంగవల్లిని ఏర్పాటు చేశారు ప్రతి జాతీయ పర్వదినాలను పరస్కరించుకుని పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ అన్నారు. వివిధ రంగులతో వేసిన రంగవల్లిని పలువురు సందర్శించి అభినందన తెలిపారు. శనివారం మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకునేందుకు పాఠశాల సిబ్బంది సిద్ధమయ్యారు.

జాతీయ సదస్సుకు విద్యావేత్త ప్రశాంత్

విశాలాంధ్ర - కొత్తూరు: నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో తేదీ 6,7లలో జరిగిన జాతీయ సదస్సులో మండలంలోని గూనభద్ర గ్రామానికి చెందిన విద్యావేత్త మండల పరిషత్తు ప్రత్యేక ఆహ్వానితులు అంపిలి ప్రశాంత్ కుమార్ పాల్గొని ఎడ్యుకేషనల్ పర్స్పెక్టివ్స్ అండ్ రోల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ అనే అంశం పైన ప్రసంగించారు. తదుపరి ఆ కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ మరియు విద్యా విభాగం అధిపతి ప్రొఫెసర్ బ్రహ్మాజీ లు ప్రశాంత్ కుమార్ యొక్క ప్రసంగానికి అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

విశాలాంధ్ర శ్రీకాకుళం
పేజీ : 3
శనివారం 8, మార్చి, 2025

గంజాయిపై 'ఉక్కుపాదం' మోపిన కూటమి ప్రభుత్వం

శిష్టకరణ సాధికారిత సమితి కన్వీనర్, సదాశివుని రాంబాబు

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్రంలోని గంజాయి వ్యాపారంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని శిష్టకరణ సాధికారిత సమితి కన్వీనర్, సదాశివుని రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ ఇటీవల పట్టణ పరిధిలో జరుగుతున్న పరిణామాలకు కూటమి ప్రభుత్వంపై వైసిపికి చెందిన కొంతమంది నాయకులు విమర్శలు చేయటం సరికాదన్నారు. మానవతా దృక్పథం ఉన్న ఏ ఒక్క వ్యక్తీ గత కొద్ది రోజుల క్రితం పట్టణంలో జరిగిన వృద్ధురాలు, గున్నమ్మ హత్యను సమర్ధించరని, హత్యను ఆసరా చేసుకొని వైసిపికి చెందిన కొంతమంది కూటమి ప్రభుత్వాన్ని విమర్శించటం న్యాయం కాదన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి బ్యాచ్‌లు చేసిన దురాగతాలు, అల్లర్లను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదని, విచ్చలవిడిగా గంజాయిని అమ్మేవారని తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, రాష్ట్ర ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి, పవన్ కళ్యాణ్ తీసుకున్న కఠిన నిర్ణయాలతో గంజాయి వ్యాపారం తగ్గుముఖం పట్టిందన్నారు. అంతేకాకుండా కూకటి వేళ్ళతో గంజాయిని తుదముట్టించటానికి రాష్ట్ర హోం శాఖ మంత్రి, అనిత చట్టాలను మరింత కఠినతరం చేసి, ప్రత్యేక బృందాలను నియమించటం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తుందని, రాష్ట్రంలో గంజాయి వ్యాపారాన్ని తుదముట్టించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కన్వీనర్, సదాశివుని రాంబాబు తెలిపారు.

ఘనంగా టెక్నివర్స్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ప్రాంగణంలో టెక్నివర్స్ కార్యక్రమం ఘనంగా ప్రారంభించబడింది. మొదటి రోజు కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సులు, ప్రాజెక్ట్ ఎక్స్పో, ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శనలు మరియు వివిధ సాంకేతిక వేదికల ద్వారా విద్యార్థులకు అనేక అవకాశాలు అందించబడ్డాయి. కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, "నేటి యువత భవిష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులు మరియు సాంకేతిక నాయకులుగా ఎదగి, ఆధునిక సాంకేతికతలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టార్ట్-అప్ సంస్కృతి మరియు ఇన్నోవేషన్‌లలో ముందుండాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అర్జియుకెటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ మాట్లాడుతూ, "ఈ కార్యక్రమాలు విద్యార్థులలో తమ సృజనాత్మకతను మరియు విజ్ఞానాన్ని ప్రపంచానికి చూపించేందుకు వేదికగా నిలుస్తాయని తెలియజేశారు."కార్యక్రమంలో డా. వివేక్ విజయ్ (అసోసియేట్ ప్రొఫెసర్, ఐఐటి జోధ్‌పూర్) ఫైనాన్షియల్ ఇంజనీరింగ్ వాల్యూయేషన్ అండ్ మేనేజ్మెంట్ అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. ఈ ప్రసంగం ద్వారా విద్యార్థులకు ఆర్థిక నిర్వహణ, విలువ నిర్ధారణ మరియు ఇన్వెస్ట్మెంట్ స్ట్రాటజీల గురించి లోతైన అవగాహన కల్పించారు. పరిటాల శివాజీ ఏఐ ప్రపంచంలోఎంటర్ ప్రెన్యూర్ షిప్ అనే అంశంపై ప్రసంగిస్తూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క వినియోగం, స్టార్ట్-అప్ సంస్కృతి మరియు భవిష్యత్ వ్యాపార అవకాశాల గురించి విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. ఇస్రోకు సంబంధించి డా. వల్లభనేని కీర్తి ఖౌతికశాస్త్రం తరగతిని నిర్వహించారు. అంతరిక్ష పరిశోధన, భౌతికశాస్త్ర సూత్రాలు మరియు వాటి ఆచరణాత్మక అనువర్తనాలను వివరించారు. స్టూడెంట్ ప్రాజెక్ట్ ఎక్స్పో అండ్ ఆర్ట్ గ్యాలరీ ఈ కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు, రోబోటిక్స్, మెకానికల్ & ఎలక్ట్రానిక్స్ ప్రోటోటైప్స్ ప్రదర్శించబడ్డాయి. ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించగలిగారు. అదేవిధంగా, ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్ట్ గ్యాలరీలో విద్యార్థులు స్వయంగా చిత్రించిన కళాకృతులు ప్రదర్శించబడ్డాయి. ఈ కళాకృతులు పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక వైభవం మరియు సామాజిక అంశాలను ప్రతిబింబించాయి.సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల కేరింతల మధ్య ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమం లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముని రామకృష్ణ,డీన్ అకాడమిక్స్ కె.మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ సిహెచ్ వాసు, కన్వీనర్ గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో లోపాలు

సిగిలిపల్లి మదన్ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

విశాలాంధ్ర-టెక్కలి: ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో లోపాలు ఉన్నాయని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్లో బుధవారం జరిగినటువంటి ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష పత్రంలో ప్రశ్న సంఖ్య 8 మరియు 13 ఒక్కొక్క ప్రశ్నకు 5x5=10 మార్కుల ప్రశ్నలు కనిపించే పరిస్థితి లేదు. పరీక్ష ప్రారంభం అయిన 25 నిమిషాల తరువాత తప్పు జరిగిందని సరి చేసుకోమని ప్రశాంతంగా పరీక్ష రాస్తున్న విద్యార్థులను సుమారు 10 నిమిషాలు పాటు అంతరాయం కలిగించి కనిపించని అంశాలు కొన్ని సెంటర్లలో రాసుకోమని బ్లాక్ బోర్డుపై మరికొన్ని సెంటర్లో వ్రాశారు. విద్యార్థులు నష్టపోయిన సమయం తిరిగి కేటాయించలేదని, పరీక్ష సమయం పెంచలేదని, పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరగే పరిస్థితులను విద్యార్థుల లో ఆందోళన ఒత్తిడికి గురి చేశారని అన్నారు. ముందుగా మూడు సెట్ల పేపర్లను సరి చూడవలసిన బాధ్యతగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఫలితమే బాగా చదివే విద్యార్థులు నష్టపోయిన పరిస్థితి ఉంది. కావున దీనిపై సమగ్ర విచారణ జరపాలని, ఇందుకు కారణమైన బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి పక్షాన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్ కుమార్ డిమాండ్ చేశారు.

ఎస్బిఐలో మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-టెక్కలి/కోటబొమ్మాళి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం, న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయమూర్తి బి.ఎం.ఆర్ ప్రసన్న లత పాల్గొని ప్రారంభించారు. జాతీయ లోక్ అదాలత్ లో పెండింగ్లో గల కేసులను లేదా ముందస్తు వ్యాజ్యాలను కూడా రాజీ చేసుకోవచ్చని కక్షిదారులు అందరూ కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకు లోన్లు తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా వాటిని తిరిగి చెల్లించాలని, లేనియెడల వాటిపై సివిల్ కేసులు పడుట దానిపై అధిక వడ్డీ కట్టవలసి ఉండుట కూడా జరుగుతుంది కనుక సమయం ప్రకారము బ్యాంకుల్లో లోన్ తీసుకున్న అందరూ కూడా తిరిగి చెల్లించాలని న్యాయమూర్తి తెలియజేశారు. వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తూ న్యాయమూర్తి ఇటువంటి సేవలు బ్యాంకు వారు కూడా నిర్వహించడం అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం కూడా చాలా సంతోషంగా ఉందని, మహిళలందరూ కూడా సమాజానికి మూల స్థానమని మహిళలు ఇటు కుటుంబంలోనూ ఇటు సమాజంలో కూడా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని పురుషు ల తో సమానంగానూ మరియు ఉన్నతంగా కూడా వారి సేవలను బాధ్యతలను నిర్వహిస్తున్నారని అటువంటి మహిళలకు ఈ సందర్భంగా న్యాయమూర్తి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ ఎస్.లక్ష్మీనారాయణ అకౌంటెంట్ మరియు అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కామేష్, బ్యాంకు సిబ్బంది, జేమ్స్ హాస్పిటల్ రాగోలు వారి వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

లింగ వివక్షత లేని సమాజానికై పోరాడుదాం

విశాలాంధ్ర-టెక్కలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు పై లైంగిక వేధింపులు, హింస, లింగ వివక్షత లేని సమాజం కోసం పోరాడుదాం అంటు సిఐటియు, యుటిఎఫ్, ఐద్వా, ఎస్ ఎఫ్ ఐ, ఆధ్వర్యంలో శుక్రవారం సిఐటియు కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. మహిళలు పై దౌర్జన్యాలు జరగకుండా ఉండాలంటే లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని, కార్మికులు కు కనీస వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టాలను ఖచ్చితంగా అమలు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సంబూరు షణ్ముఖరావు, అంగన్వాడీ సంఘం నాయకులు బి.రవణమ్మ, జి.భాగ్యం, డి. ఆదిలక్ష్మి,యస్.ఉమాబాయి, బి.మల్లేశ్వరి, కె.లత,ఐద్వా నుండి తంగాన యశోదమ్మ, బొడ్డేపల్లి మల్లయ్య, కొల్లి యల్లయ్య సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు ఘన సత్కారం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను ఉపాధ్యాయ సిబ్బంది సాలువాతో ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం తనుజ, అప్పల నరసింహ, కళ్యాణి, రాజలక్ష్మి,అనసూయ లక్ష్మి, ఫాతిమా, తేజ, ఉపాధ్యాయులు మురళి ప్రకాష్, తెప్పల రవి, వెంకటేశ్వర్లు, లమ్మత మురళి పాల్గొన్నారు.

ఘనంగా జామి ఎల్లమ్మ జాతర

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలంలోని కవిటి, నెలవంక, కుసుంపురం, కొత్తపాలెం గ్రామాల్లో జామి ఎల్లమ్మ జాతరను శుక్రవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దలను మేళతాళాలతో గ్రామాల్లో ఊరేగించి అనంతరం గుడి వద్దను మొక్కులు తీర్చుకున్నారు. యాత్రలో పలు గ్రామాల ప్రజలు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా ఉద్యోగ విజయోత్సవం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ లో ఘనంగా ఉద్యోగ విజయోత్సవం స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ లో శు క్రవారం ఉద్యోగ విజయోత్సవం ఘనంగా జరిగింది. పాలిటెక్నిక్ లో జరిగిన క్యాంపస్ ఎంపికలో ప్లేస్మెంట్ సాధించిన విద్యార్థులందరినీ సభ అభినందించింది. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డాక్టర్ వి సుగుణాకర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ఆయన చెప్పారు. డిప్లొమా స్థాయిలోనే మంచి ప్యాకేజీ తో ఉద్యోగం సాధించడం గొప్ప విషయం అని ఆయన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి విక్టర్ పాల్, విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లేస్మెంట్లు సాధించిన విద్యార్థులు అందరికీ అతిథులు నియామక పత్రాలు అందించారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఇక్కడ చదివిన పాత విద్యార్థులంతా తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో తమ అనుభవాలను, తమ సాధించిన విజయాలను పూర్వ విద్యార్థులంతా పంచుకున్నారు. సాయంత్రం కళాశాల యాన్యువల్ డే సెలబ్రేషన్ జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విక్టర్ పాల్ ఈ సంవత్సరపు వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ ఏడాది కళాశాల పలు రంగాల్లో అభివృద్ధి సాధించిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చివరిగా విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలను ప్రదర్శించారు.

టీ ఫోర్ సర్వే సమర్ధవంతంగా చేపట్టాలి...

ఎంపీడీవో మురళీమోహన్ కుమార్

విశాలాంధ్ర-జలుమూరు: శనివారం నుండి మార్చి 18 వరకు జరిగే టీ పోరు సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని సార్వకోట మండల అభివృద్ధి అధికారి పి వి వి మోహన్ కుమార్ అన్నారు. మండల కేంద్రం సారవకోట సర్వసభ్య సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని సర్వే చేపట్టవలసిన విధి విధానాలను వివరించారు. ప్రతి కుటుంబాన్ని విడిచిపెట్టకుండా సర్వే నిర్వహించాలని ఆయన గ్రామస్థాయి సర్వేలను సూచించారు. ఆయనతోపాటు మండల పర్యవేక్షణ అధికారిని పలువురు సర్వేలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలో వివిధ ప్రభుత్వ శాఖలను పరిశీలించిన ఎంపీడీఓ

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం పంచాయతీ పాతూరు ధర్మలక్ష్మి పురం గ్రామంలో శుక్రవారం పాఠశాల పనితీరు అంగన్వాడి వివిధ ప్రభుత్వ శాఖలను పరిశీలించారు. పాతూరు అంగన్వాడి కేంద్రంలో పిల్లల హాజరు పౌష్టికాహార పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. లక్ష్మీపురంలో పాఠశాల పనితీరు రక్షిత నీటిపథకం పనితీరు పరిశీలించారు. వేసవి వస్తున్న దృష్ట్యా తాగునీరు సరఫరా అందుబాటులో ఉండే విధంగా దిగు స్థాయి అధికారులతో మాట్లాడారు. ఆయనతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల దండుగోపాలపురము పాఠశాల పూర్వ విద్యార్థి ఆరంగి శరత్ కుమార్ పదో తరగతి విద్యార్థుల కు శుక్రవారం పరీక్ష సామాగ్రి ని పంపిణీ చేశారు. శరత్ కుమార్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆరంగి వసంత రావు కుమారుడు ప్రస్తుతం ఒక సాఫ్ట్ వేర్ కంపెనీ ఇంజనీర్ గా పనిచేస్తున్నారు. ఈపాఠశాల నుంచి ఈ ఏడాది 72మంది పదో తరగతి పరీక్షలు రాస్తుండగా వారికి అవసరం ఉన్న రైటింగ్ పాడ్, స్కెలు పెన్నులు, పెన్సిల్ మొదలుగు సుమారు రూ.8వేలు వస్తువులు హెచ్ ఎం కోత చైతన్య చేతులు మీదుగా విద్యార్థులు కు అందజేశారు. ఈ కార్యక్రమం లో బెండి అరుణ్ కుమార్, పొందల సురేష్, ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, నాగేశ్వరరావు, లక్ష్మి, పార్వతి, రాము, ఉమ, చిన్నారావు, మురళీధరరాజు, రవికుమార్,విజయలక్ష్మి, మార్కండేయులు, శ్రీనివాసరావు, దయాసాగర్ పాల్గొన్నారు.

రేపటి నుండి సంతబొమ్మాళి లో హనుమాన్ ఉత్సవాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళి లో వెలసిన శ్రీ పంచముఖాంజనేయ స్వామి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నుంచి మూడు రోజులు పాటు ఉత్సవాలు జరగనున్నాయి. కీర్తిశేషులు పప్పు భుజంగ రావు ఆలయం నిర్మించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అత్యంత వైభవంగా వార్షికోత్సవం ఏర్పాట్లు చేస్తున్నట్లు గురు స్వామి పప్పు రాజు తెలిపారు. గ్రామ ప్రజలు సహకారం తో ఆలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు లలో స్వామి వారి తిరువీధి తో ఆరంభమై వేదపండితులు తో నాగవల్లి సహస్ర పత్రార్చన, మహా రుద్ర బిల్వార్చన,సింధూర పూజ కార్యక్రమాలు జరగనున్నాయి.ఈ ఉత్సవాలు సందర్భంగా చిత్రలేఖనం పోటీలు తో పాటు పుర వీధుల్లో కోలాటం నృత్య ప్రదర్శన లు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చివరి రోజు న మంగళవారం మహా చండీ హోమం,మహా అన్న సమారాధన, పలు సంస్కృతి క కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.